క్లుప్తంగా

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మద్దిలేటయ్య

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుండే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ.1,54,370 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా


ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

కోవెలకుంట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో శనివారం ఆయుష్మాన్‌భవ: కార్యక్రమం ద్వారా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వారానికోసారి ఆరోగ్య మేళా నిర్వహిస్తామన్నారు. గర్భిణి, మాతా, శిశు,శస్త్ర చికిత్స, చెవి ముక్కు, గొంతు, చిన్నపిల్లలు, మానసిక రోగులు, చర్మ వ్యాధులకు ప్రత్యేక నిపుణుల ద్వారా పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హెచ్‌ఎం లలిత శ్యామల తెలిపారు. గ్రీన్‌డేను పురస్కరించుకుని శనివారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పట్టణంలోన ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లను విచ్చలవిడి రహితంగా నరికి వేస్తుండటంతో అడవులు అంతరించి పోతున్నాయన్నారు. వాతావరణ కాలుష్యమేర్పడి ఓజోన్‌పొర దెబ్బతింటోందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి పెంచి పెద్ద చేయాలన్నారు.

29న మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే మండల మీట్‌లో విద్య, వైద్యం, గ్రామీణ నీటిసర ఫరా, వ్యవసాయ, విద్యుత్, గ్రామీణ గృహ నిర్మాణశాఖ, పశుపోషణ, మాతా శిశుసంక్షేమ, రెవెన్యూ, ఉపాధి తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

నేడు షటిల్ టోర్నమెంట్

డోన్ : ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 24న స్థానిక శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక్కరోజే జరిగే ఈ పోటీలలో ఏ, బీ, సీ గ్రూపులుగా క్రీడాకారులను విభజించి టోర్నమెంట్‌ను నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వీపర్‌గా పని చేస్తున్న లక్ష్మన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు గూని నాగరాజు, రమణ, నిరంజన్, రమేష్, మద్దిలేటి, వెంకటరాముడు రూ.10వేలు అందజేశారు.

గ్రంథాలయం తనిఖీ

బనగానపల్లెరూరల్: బనగానపల్లె గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ శనివారం తనిఖీ చేశారు. రకాల పుస్తకాలు, గ్రంథాలతో పాటు వార, మాస, దినపత్రికల వివరాల రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రంథాలయంలో ఎంత మంది సభ్యులు ఉన్నారు, రోజు ఎంత మంది పాఠకులు గ్రంథాలయానికి వస్తుంటారు తదితర విషయాలపై స్థానిక గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఈఓ ఖలీల్‌బాషాను కలిసి గ్రంథాలయానికి సంబంధించి పన్ను వెంటనే చెల్లించాని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కోవెలకుంట్ల: దళితుల సమస్యలు పరిష్కరించాలని దళిత సమాఖ్య నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంజీవకుమార్ కోరారు. దళిత సమాఖ్య కోవెలకుంట్ల మండల అధ్యక్షుడిగా మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా కేటాయించే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దళితుల అభ్యున్నతికి వినియోగించాలన్నారు. అంటరానితనం, దళితులపై దాడులు అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ పుష్పకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జాన్సన్, భరత్ పాల్గొన్నారు.

మొక్కజొన్న... లాభాలు మిన్న!

- జిల్లా సాగు విస్తీర్ణం 41.434 హెక్టార్లు
- ఎకరానికి 35 క్వింటాళ్ల వరకు దిగుబడులు
- ఆశాజనకంగా మద్దతు ధర
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


ఆరబోసిన మొక్కజొన్న పంట దిగుబడులు

బనగానపల్లె : మొక్కజొన్న సిరులు కురిపిస్తుంది. గతేడాదితో పోలిస్తే జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 41.898 హెక్టార్లుకాగా 41.434 హెక్టార్లలో ఈ పంటలను సాగు అయ్యింది. గతేడాది ఖరీఫ్ రబీ సీజన్లలో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు కలిసొచ్చింది. రైతులు ఆదాయం మూటగట్టుకున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 25–30 క్వింటాళ్ల దిగుబడి రాగా రబీలో 30–35 క్వింటాళ్ల దిగుబడి లభించింది. క్వింటాం దాదాపు రూ.2వేలు గిట్టుబాటు ధర లభించడంతో పెట్టుబడిపోను ఎకరానికి రూ.30–35 వేలు మిగులు లభించింది. దీంతో ఈ యేడాది ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న సాగుకే మొగ్గు చూపారు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగింది. రైతుల అంచనా మేరకు దిగుబడులు వచ్చాయి. గత 15 రోజులుగా కోతలు మొదలయ్యాయి. ఎకరానికి 28–35 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు సంతోషంగా చెబుతున్నారు. అదేవిధంగా క్వింటాంకు రూ.2200–2300 గిట్టుబాటు ధర లభిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

పెట్టుబడులు తక్కువ.. ఆదాయం ఎక్కువ

మొక్కజొన్న సాగులో పెట్టుబడులు తక్కువగా ఉండడంతో ఆదాయం ఎక్కువగా వస్తుంది. చీడపీడల బెడద కూడా తక్కువే. దుక్కిసేద్యాలు కలుపు తొలగింపు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు తదితర వాటికి ఎకరానికి రూ.20వేలకు మించడంలేదు. ప్రస్తుతం ఉన్న గిట్టుబాటు ధర మేరకు ఎకరానికి రూ.60–70వేలు వరకు వస్తుంది. పెట్టుబడిపోను రూ.30వేల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో మొక్కజొన్న పంట దిగుబడులకు మంచి డిమాండ్ ఉన్నందున వ్యాపారులు కూడా కొనుగోళ్లకు పోటీ పడుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఈ ఖరీఫ్ సాగు విస్తీర్ణం జిల్లా వ్యాప్తంగా పెరిగింది. కొన్ని మండలాల్లో సాధారణ విస్తీర్ణాన్ని మించి మొక్క జొన్నను సాగు చేశారు రైతులు. కొన్ని మండలాలను పరిశీలిస్తే... బనగానపల్లె మండలంలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 1098 హెకార్లు ఉండగా ఏకంగా 1927 హెక్టార్లలో సాగు అయ్యింది. అదేవిధంగా ఆళ్లగడ్డ మండలంలో సాధారణ విస్తీర్ణం 1106 ఉండగా 2310 హెక్టార్లు సాగు అయ్యింది, గోస్పాడు 67–133 హెక్టార్లలో సాగు, ఆత్మకూరు 4580– 4794 హెక్టార్లలో సాగు, కొత్తపల్లి 3851– 4952 హెకార్టలో సాగు, బేతంచర్ల 456– 557 హెకార్లలో సాగు, ప్యాపిలి 54– 550 హెక్టార్లలో సాగు, కోవెలకుంట్ల 147– 312 హెక్టార్లలో సాగు, అవుకు 371–944 హెక్టార్లలో సాగు, సంజామల 142– 353 హెక్టార్లలో సాగు, పాణ్యం సాధారణ విస్తీర్ణం 449 ఉండగా 479 హెక్టార్లతో మొక్కజొన్న సాగు చేశారు. దిగుబడులు, మద్దతు ధర ఆశాజనకంగా ఉన్నందునే మొక్కజొన్న సాగు లాభదాయకంగా ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు రైతులు.

వ్యవసాయ సబ్ డివిజన్‌లవారీగా సాగు వివరాలు

డివిజన్	సాధారణ సాగు హెక్టార్లలో	సాగు విస్తీర్ణం హెక్టార్లలో
ఆళ్లగడ్డ	4,599	6,387
ఆత్మకూరు	15,766	15,239
డోన్	538	1176
కోవెలకుంట్ల	795	1977
నందికొట్కూరు	15,801	12,323
నంద్యాల	4,405	4,332

ఆశా జనకంగా పంట దిగుబడులు



ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంట దిగుబడి ఆశా జనకంగా ఉంది. నాలుగు ఎకరాలలో ఈ పంటను సాగు చేశా. ఎకరానికి 25–30 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. ఎకరానికి రూ.20వేలు పెట్టుబడి ఖర్చు అయ్యాయి. ప్రస్తుతం క్వింటాం రూ.2200 ఉంది. ఖర్చులు పోను ఎకరానికి రూ.30వేల వరకు మిగులు లభించే ఆవకాశం ఉంది.

–సోమ్లానాయక్, రైతు, కాలేనాయక్‌తాండా, బనగానపల్లె మండలం

రైతులకు లాభసాటి పంట



అన్ని పంటలకన్నా మొక్కజొన్న పంట లాభసాటిగా మారింది. దీంతో గత సంవత్సరం నుంచి ఈ పంట సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. నేను 15 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశా. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి లభించింది. ప్రభుత్వం కూడా మొక్కజొన్న పంటకు క్వింటాం రూ.1962లు గిట్టుబాటు ధర కల్పించింది. దీంతో వ్యాపారులు గిట్టుబాటు ధరకు మించి రైతుల నుంచి కోనుగోలు చేస్తున్నారు.

– సుబ్బారెడ్డి రైతు, ఇల్లూరుకొత్తపేట, బనగానపల్లె మండలం

రైతులకు కలిసొచ్చిన పంట



గతంలో మొక్కజొన్న సాగును రైతులు ఎక్కువ ఇష్టపడేవారు కాదు. ప్రభుత్వంలో రైతులు సాగు చేసిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర ప్రకటించడంతో ప్రస్తుతం ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ పంట సాగుకే రైతులు ఇష్టపడుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున వ్యాపారులు కూడా పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు ఈ పంట లాభసాటిగా మారింది.

– సుబ్బారెడ్డి, ఏఓ బనగానపల్లె మండలం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండల పరిధిలోని చిన్నమల్కాపురం ఫీడర్ 33 కేవీలైన్ మెయింటెనెన్స్ పనులు నేపథ్యంలో ఆదివారం మల్కాపురం, ఆర్‌ఎస్.రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు ఉండదని రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ఫ్యాక్టరీల యాజమాన్యాలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రంగాపురం పరిధిలో....

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూధన్‌రెడ్డి తెలిపారు. జాతీయ రహదారి విస్తీరణ పనుల్లో భాగంగా మధ్యాహ్నం 1 నుంచి 6:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బొంకూరి రవికుమార్

డోన్ టౌన్ : డోన్ మండల బీజేపీ అధ్యక్షుడిగా చింతలపేట గ్రామానికి చెందిన న్యాయవాది బొంకూరి రవికుమార్, పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు. నంద్యాల జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగిందని వారు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

క్విజ్ పోటీలు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎస్‌ఎస్‌ఎస్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గూడూరు ప్రభుత్వ కళాశాల లెక్చరర్ చంద్రశేఖర్ విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. రెండు జట్లుగా ఏర్పాటైన విద్యార్థుల్లో విజేతగా నిలిచిన జట్టుతో పాటు రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు బహుమతులు అందజేశారు. అనంతరం క్విజ్ నిర్వాహకులు చంద్రశేఖర్, వెల్దుర్తి జూనియర్ కళాశాల లెక్చరర్ అశోక్‌బాబును సన్మానించారు.

బాధితులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ


గృహాలు కోల్పోయిన బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ : డోన్, నంద్యాల రైల్వే డబుల్ లైన్ నిర్మాణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు శనివారం ఆర్డీఓ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చూర్మన్ కోట్రికె హరికిషన్ నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే డబుల్ లైన్ ఏర్పాటు మూలంగా తప్పనసరి పరిస్థితుల్లో పట్టణంలోని నంద్యాల గేట్ల నుండి పాతబుగ్గ వరకు సుమారు 183 గృహాలను తొలగించాల్సి వచ్చిందన్నారు. ఇందుకు గానూ ఒక్కో ఇంటికి రూ.14లక్షల చొప్పున 183 గృహాలకు నష్టపరిహారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. డబుల్ లైన్ నిర్మాణానికి సహకరించిన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం కూడా సంపూర్ణ సహకారాలు అందజేస్తుందన్నారు. బాధితుల పునరావాసం కోసం అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ గార్లదిన్నె రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి


కేఈ మాదన్న నగర్‌లో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డోన్ టౌన్ : ప్రజలకు వైద్య సేవలు అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. ఈ మేరకు ఇంటింటి సర్వేలో భాగంగా శనివారం పట్టణంలో పలు సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని అవసరమైన వారికి ఉచితంగా వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అందించడం కోసం ఈ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇంటింటా సర్వే పూర్తయిన తరువాత ఈ నెల 30వ తేది కొండపేటలోని బీసీ బాలుర వసతి గృహంలో మోగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ సచివాలయం హెల్త్ సెక్రెటరీ సుజాత, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, కుల్లాయమ్మ, లావణ్య, వలంటీరు రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు పంటల నమోదు చేసుకోవాలి


క్షేత్రస్థాయిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారిణి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఉద్యానవన పంటలకు సంబంధించి ఈ నెలాఖరులోపు పంట నమోదు చేసుకోవాలని ఆ శాఖ అధికారిణి ధరణి సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు ఉద్యానవన పంటలైన మిరప, పండ్లు, కూరగాయలు, పూల తోటలు సాగు చేశారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ఈ– క్రాఫ్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. అతివృష్టి, అనావృష్టి తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట నష్టం జరిగితే ఈ క్రాఫ్ ఆధారంగానే పరిహారం, ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. పంట సాగుకు సంబంధించిన వివరాలు, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, సెల్‌నంబర్ తదితర వివరాలతో రైతులు పంటల నమోదు చేసుకోవాలని వివరించారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి


టీ స్టాల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బేతంచెర్ల: ఆహార పదార్థల అమ్మకం, తయారీకి తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, షేక్ ఖాశీమ్ వలి సూచించారు. శనివారం పట్టణంలోని టీస్టాల్స్, హోటల్స్‌ను వారు తనిఖీ చేశారు. అరోమా టీ స్టాల్‌లో టీపొడి, చక్కెరను షాంపిల్స్ తీసుకున్నారు. వాటిని హైదరాబాద్‌లోని సేఫ్టీ ఫుడ్ లేబరేటరీకి పంపిస్తామని, నివేదికల మేరకు చర్యలు ఉంటాయని వారు చెప్పారు. టీ స్టాల్‌లో ఫుడ్ లైసెన్స్ లేనందున నోటీస్ ఇచ్చామని చెప్పారు.

సదస్సును జయప్రదం చేయాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న పాస్టర్లు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని గుత్తి రోడ్డులో ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్లో అక్టోబర్ 18,19 తేదీల్లో నిర్వహించనున్న దైవ సేవకుల సదస్సును జయ ప్రదం చేయాలని డోన్ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ రావు, శ్యాంసన్ కోరారు. స్థానిక క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్లో శనివారం సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను సభ్యులతో కలిసి వారు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సదస్సుకు ప్రముఖ ప్రసంగీకులు హైదరాబాద్‌కు చెందిన రెవ.లివింగ్‌స్టన్, చెన్నైకి చెందిన బ్రదర్ రాజుబాబు హాజరవుతారన్నారు. కోశాధికారి ప్రవీణ్ ,నిత్యానందం, ఏడీ రాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వందశాతం పూర్తవ్వాలి

- పీడీ వెంకటసుబ్బయ్య వెల్లడి


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య

డోన్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వందశాతం పూర్తవ్వాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులను చైతన్య పరచాలని జిల్లా హౌసింగ్ శాఖ పీడీ వెంకట సుబ్బయ్య సూచించారు. డోన్ సబ్‌డివిజన్ పరిధిలో 9,792 ప్రభుత్వ పక్కాగృహాలలో 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం త్వరితగతిన నిర్మించుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన జరిగిన గృహనిర్మాణ పురోగతి సమీక్ష సమావేశానికి పీడీతోపాటు మంత్రి ఓఎస్‌డి ప్రతాప్‌రెడ్డి, డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రాజశేఖర్ రెడ్డి, హౌసింగ్ డీఈ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ గృహ నిర్మాణాలల్లో డోన్ ద్వితీయస్థానంలో ఉందన్నారు. డిసెంబర్ నాటికి పెండింగ్‌లో ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. డోన్ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు మాట్లాడుతూ ఏ కారణంతోనైనా జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకోలేని వారికి అధికారులు మళ్లీ అవకాశం కల్పిస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలలో మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక వసుతులను ప్రభుత్వం కల్పించిందని, లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ నాగభూషణం, వీరేంద్ర, కౌన్సిలర్ ఆర్ట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

27న బనగానపల్లెలో 'జగనన్నకు చెబుదాం'

- హాజరు కానున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్

బనగానపల్లె : బనగానపల్లె మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 27న ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తోపాటు జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలను మరువరాదు

బేతంచెర్ల: ప్రపంచ దేశాలకు ఆదర్శమైన మన సంస్కృతి, సంప్రదాయాలను మరువరాదని ప్రముఖ ప్రవచన కర్త వైష్ణవ వెంకట రమణ మూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని అమ్మవారిశాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో దేశ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా భగవద్గీత శ్లోకాను ఆలపించి అర్థాన్ని వివరించారు. అనంతరం వెంకట రమణ మూర్తిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్‌రావు, మాజీ అధ్యక్షులు గుండా గోపాల్, కంద గడ్డల రామూర్తి, గురవయ్య తదితరులు సన్మానించారు.

ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయురాలికి సిల్వర్ మెడల్


షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన లుథియమ్మ (ఫైల్)

డోన్ : మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఈనెల 16, 17వ తేదీల్లో జరిగిన 35వ మలేషియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో డోన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ అసిస్టెంట్ డైరెక్టర్ లుథియమ్మ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ పోటీల్లో ఇండియాతో పాటు ఐర్లాండ్, సింగపూర్, శ్రీలంక, ఇండోనేషియా, సౌతాఫ్రికా, యూనైటెడ్ స్టేట్స్, ఖతర్ దేశాలు పాల్గొన్నాయి. ఈ మేరకు షాట్‌పుట్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన లుథియమ్మ జావిలిన్ త్రో పోటీల్లోనూ నాలుగవ స్థానంలో నిలిచారు. లుథియమ్మకు హెచ్‌ఎం మైమున్నిసాతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

సంజామల: బనగానపల్లె మండలం నందవరం ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ నియోజకవర్గం స్థాయి పోటీల్లో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా స్థాయికి అండర్ –17 బాలికల విభాగంలో 800, 1500 మీటర్స్ రన్నింగ్ ఈవెంట్‌కు హనీఫా, అండర్–14 బాలుర విభాగంలో ఖోఖో, 600 మీటర్స్ రన్నింగ్ ఈవెంట్‌కు శివశంకర్, యోగాకు ఉపేంద్ర, బాలికల విభాగం యోగాకు రుఫియా ఎంపిక అయ్యారని హెచ్‌ఎం టీ. శంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు వ్యాయమ ఉపాధ్యాయులు బాషా, యోగ మాస్టర్ హుసేన్ బాషా, ఉపాధ్యాయులు హరిప్రియానంద రెడ్డి తదితరులు అభినందించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామానికి చెందిన కుమ్మరి జెయుడు (38)కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కుమ్మరి జెయుడు ఈ నెల 18న రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలంలోకి కరెంట్ పని నిమిత్తం తోటి కూలితో బయల్దేరారు. స్తంభం ఎక్కి వైర్ లాగుతున్న సమయంలో ప్రమాదవత్తుశాత్తూ కింద పడడంతో కాలుకు తీవ్రగాయం అయింది. తోటి కూలీల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు జెయుడిని కొవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని పోలిసులు తెలిపారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని



బనగానపల్లె: విజయవాడ కనదుర్గమ్మను శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదించారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

డోన్ రూరల్ : అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ భీమలింగప్ప హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామంలో దాడులు చేశామని, గ్రామానికి చెందిన కృష్ణమూర్తి నుంచి 90ఎంఎల్ ఓరిజినల్ చాయిస్ 96, 576 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిని విచారించగా కర్నూలు పట్టణానికి చెందిన ఈడిగ గిరిబాబు మద్యం సరఫరా చేస్తున్నట్లు అంగీకరించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు అదుపులోకి తీసుకున్న కృష్ణమూర్తిని రిమాండ్‌కు పంపామన్నారు.

నాణ్యమైన సరుకులు అందుబాటులో ఉంచాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

బేతంచెర్ల: మహిళా చేయూత మార్ట్‌లో ప్రజలకు నాణ్యమైన సరుకులను అందుబాటులో ఉంచి, అమ్మకాలు పెంచాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ అన్నారు. శనివారం పట్టణంలోని మహిళా చేయూత మార్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. అందరూ బాధ్యతగా పని చేసి మహిళా చేయూత మార్ట్ వ్యాపార అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం లింగమయ్య, సీసీ రామసుంకడు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సక్రమంగా చేయాలి

ప్యాపిలి: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, వైద్యాధికారి నితీష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వైద్యసిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించాలన్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, కంటి, దంత, గళ్ల తదితర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు.